ఆహ్లాదం.. ఆనందం!

- సందడిగా సాగిన కార్తీక వనభోజనాలు
- స్నేహభావం పెరిగేందుకు దోహదపడిందని భావన
- నేటితో ముగియనున్న కార్తీకమాసం



వనభోజనానికి హాజరైన మహిళలు

ఇల్లెందురూరల్: కార్తీక మాసం వచ్చిందంటే భక్తిభావంతో భగవంతుడిని ఆరాదించడంతోపాటు అంతా వనభోజనాలకు సిద్ధమైపోతారు. ఇందులో పల్లె, పట్టణం తేడా కనిపించదు. వృత్తి, సామాజిక వర్గం, వయోభేదం ఉండదు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, ఇంటి పనులు, ఇంకా సమయం దొరికితే టీవీలు, కంప్యూటర్లు, ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్‌లకు అంకితమైపోతున్న నేటి సమాజం వీటన్నింటిని దూరం పెట్టి కార్తీకం తెచ్చే వనభోజనాలకు వెళ్లి ఒక్క రోజైనా హాయిగా గడుపుదామని ప్రణాళికలు వేసుకుంటారు. ఆనందాన్ని, అనుబంధాల్ని, మధురానుభూతుల్ని పదిలం చేసుకుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా కార్తీక మాసంలో వనభోజనాల సందడిగా సాగగా.. మంగళవారంతో కార్తీక మాసం ముగియనుంది. దీంతో ఈ నెలలో సాగిన వన భోజనాలను పలువురు మధురస్మృతులుగా మలుచుకున్నారు.

వనభోజనాలు ప్రారంభమయ్యాయిలా..

కార్తీక వనమహోత్సవాల ప్రసక్తి పురాణాల కాలం నుంచే ఉంది. ఉసిరి చెట్టు కింద మహావిష్ణువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి కార్తీక దామోదరుడిగా భావించి, గోవింద నామస్మరణ చేస్తూ ఉసిరితో పూజించినట్లు పురాణాల్లో చెప్పబడింది. ఔషధ గుణాలతో నిండి ఉన్న ఉసిరి తోట లేదా ఉద్యానవనాన్ని వన భోజన మహోత్సవాల కోసం ఎంచుకోవడం పూర్వం నుంచి కొనసాగుతోంది.

ఆరోగ్యకరమైన ఆహారం..

వనభోజనాలు, పిక్నిక్‌ల పేరుతో హోటళ్లలో లభించే వంటకాలపై కొందరు ఆధారపడతారు. పిజ్జాలు, బర్గర్లు, మందు, మటన్ వంటివి ఇష్టపడతారు. కానీ, చాలా మంది సంప్రదాయ పిండి వంటకాలతో కార్తీక వనభోజన మహోత్సవాలు పూర్తిచేయడం విశేషం. అంతేకాకుండా ప్లాస్టిక్ వస్తువులను సైతం దూరం పెట్టారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, విస్తర్ల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్నిచ్చే ఆకులతో సిద్ధం చేసిన విస్తర్లలో భోజనం ఆరగించడం విశేషం. ఔషధ గుణాలు కలిగిన అరటి, మోదుగు, పాల, బాదం, తామర తదితర ఆకులతో తయారు చేసిన విస్తర్లను వనభోజనం సందర్భంగా వాడారు. తద్వారా పర్యావరణ స్వచ్ఛతకు తోడ్పడినట్లయింది. చెట్ల నీడన, పచ్చని ఆకుల్లో వన భోజనం చేయడంలో ఉన్న ఆనందం చెప్పలేనిది. అంతేకాకుండా ఇలా చేయడం ఆరోగ్యంగా భావించారు.

సమీపంలోని తోటల్లోనే..

జిల్లా వ్యాప్తంగా కార్తీక వనభోజనాలు ఏటా ఘనంగా నిర్వహించుకుంటారు. సామాజిక వర్గాలు, వృత్తి సంబంధం, స్నేహితులు ఇలా పలు రకాలుగా విడిపోయి ప్రజలు వనభోజనాలకు వెళ్తుంటారు. అయితే, పూర్వం వనాలతో కూడిన చరిత్రాత్మక ప్రదేశాలు, అడవులలోకి వనభోజనాలకు వెళ్లేవారు. కానీ, నేడు వనాలు అంతరించిపోతుండటంతో అవి జనావాసాలకు దూరమయ్యాయి. ఈ కారణంగా సమీపంలోని మామిడితోటలు, ఇతర పండ్ల తోటలను ప్రజలు ఎంచుకున్నారు. మరికొందరు సమీపంలోని పార్కుల్లో వనభోజన మహోత్సవాలు పూర్తిచేశారు. ఇంకా చూడముచ్చటైన పిక్నిక్ స్పాట్లకు సైతం పలువురు వెళ్లారు.

మధురస్మృతుల వేదిక

నిత్యం ఇంటి పనులతో బిజీబిజీగా గడిపే మహిళలకు కార్తీక వనభోజనాలు మధురస్మృతులను అందిస్తున్నాయి. మహిళలు కలిసి పనులు చేసుకోవడం, రుచులు, అభిరుచులు పంచుకోవడం కార్తీక వన భోజన మహోత్సవం ప్రత్యేకత. ఇవేకాకుండా తమకు ఇష్టమైన ఆటలు ఆడటం, పాటలు పాడటం, నాటకాలు వేయడం, నృత్యాలు చేయడం వంటివన్నీ కార్తీక వనభోజన మహోత్సవంలో ప్రతిఒక్కరికీ మధురానుభూతులుగా మిగిలాయి.



నృత్యం చేస్తున్న చిన్నారులు

స్నేహభావం బలపడుతుంది



వనభోజనాల వల్ల కుటుంబాల్లో, వ్యక్తుల్లో స్నేహ బంధాలు బలపడుతాయి. ఒకరికొకరు సహకరించుకోవడం, రుచులు, అభిరుచులు పంచుకోవడం, కలిసి పనులు చేసుకోవడం, నచ్చిన ఆటలు ఆడుకోవడం కొత్త జీవితంలా అనిపిస్తుంది. స్నేహితుల సంఖ్యను పెంచుకుంటూ ఒక రోజంతా ఆనందంగా గడిపే వేదిక వనమహోత్సవం.

–ఆళ్ల శిరీష, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

చెప్పలేని ఆనందం



వనభోజనాలకు వెళ్లినప్పుడు చెప్పలేని ఆనందం పొందాం. జీవితంలో కొత్త అనుభూతి. అందరూ కలిసి పనిచేయడం, ఆటలు, పాటలతో సరదాగా గడుపుతాం. వయసును బాధ్యతలను మరిచి చిన్న పిల్లల్లా ఆడుకుంటాం. పిల్లలు కూడా చాలా ఆనందంగా గడుపుతారు. కార్తీక వనభోజన మహోత్సవం తీపి జ్ఞాపకాలను మిగిల్చింది.

–వేముల సుగుణ, బాలాజీనగర్, ఇల్లెందు మండలం

కొత్తగూడెం ప్రజలకు రుణపడి ఉంటా..

విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం)/సుజాతనగర్/పాల్వంచ: ఎమ్మెల్యేగా తనను గెలిపించిన కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని కూనంనేని సాంబశివరావు తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశాక తొలిసారి వచ్చిన ఎమ్మెల్యేకు నాయకులు సుజాతనగర్ మండలం డేగలమడుగు వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడ మొదలైన ర్యాలీ కొత్తగూడెం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కూనంనేని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. తన గెలుపునకు కృషిచేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం హామీలను నెరవేర్చేలా పాటుపడతానని చెప్పారు. అనంతరం ర్యాలీ పాల్వంచకు చేరుకోగా ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన కూనంనేని.. పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు నాగా సీతారాములు, కాసాని ఐలయ్య, ఎస్‌కే సాబీర్‌పాషా, బందెల నర్సయ్య, కొత్వాల శ్రీనివాసరావు, బి.అయోధ్య, బండి రమేశ్, గుగులోత్ నగేశ్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, తాళ్ల వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, దుర్గరాశి వెంకన్న, ముత్యాల విశ్వనాథం, డాక్టర్ శంకర్‌నాయక్, తోటా దేవీప్రసన్నతో పాటు అందెల ఆనందరావు, ఆంతోటి నాగేశ్వరావు, ఆంతోటి పాల్, తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్: ఎమ్మెల్యే కూనంనేనికి స్వాగతం పలుకుతున్న మహిళలు

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం

విజయోత్సవ ర్యాలీల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం, అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వెల్లడించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి సోమవారం ఇల్లెందుకు వచ్చిన ఆయనకు కాంగ్రెస్, మిత్రపక్షాల ఆధ్వర్యాన ఘనస్వాగతం పలికారు. కరెంట్ ఆఫీస్ నుంచి ప్రధాన రహదారి వెంట విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా అంబజార్ మీదుగా గోవింద్ సెంటర్ వరకు చేరింది. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతూనే, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడగా నాయకులు, ప్రజాప్రతినిధులు డానియేల్, పులి సైదులు, రమేశ్‌చంద్రగుప్త, ఎస్‌కే జానీ, పోషం వెంకటేశ్వర్లు, నందకిశోర్, ముద్రగడ వంశీ, సారయ్య, బంధం నాగయ్య, మడుగు సాంబమూర్తి, శ్రీనివాస్, బోళ్ల సూర్యం, పింగళి నరేశ్, తాటి భిక్షం, హరినాథ్‌బాబు, మెరుగు కార్తీక్ యాదవ్, ఈసం నర్సింహారావు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలుచేస్తాం

టేకులపల్లి: గత పాలకుల మాదిరిగా దోచుకోవడం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తమ ప్రభుత్వం అమలుచేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వెల్లడించారు. మండలంలోని గోలియాతండా నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించగా భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక కనకయ్య మాట్లాడారు. కాగా, ఎమ్మెల్యే కనకయ్యను టేకులపల్లి మండలం కోయగూడెంలోని ఆయన స్వగృహం, సొసైటీ కార్యాలయంలో పలువురు సోమవారం కలిసి సన్మానించారు. సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ఆధ్వర్యాన డైరెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎంపీపీ భూక్యా రాధ, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈలు నవీన్, రాజు, ఐసీడీఎస్ సీడీపీఓ కేఎం తార, సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, కె.సక్కుబాయి, బి.యశోద, బి.నిర్మలతో పాటు భూక్యా దేవానాయక్, రాసమల్ల నర్సయ్య, ఈసం ప్రసాద్, అర్జున్‌రావు, తాడోజు భిక్షమయ్య, నర్సింగ్ లక్ష్మయ్య, జాల సంధ్య, మురళి, బానోతు మోనిక, శంకర్, శివరంజని, జానీ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.



ఇల్లెందు: విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు



టేకులపల్లి : వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కనకయ్య

తుపాన్ బాధితులకు పరిహారం చెల్లించాలి



ఇల్లెందురూరల్: తహసీల్ ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు



సుజాతనగర్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాపంథా నాయకులు

ఇల్లెందురూరల్: పంట చేతికందే సమయంలో వచ్చిన తుపాన్ ప్రభావంతో అన్నదాత తీవ్రంగా నష్టపోయాడని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం, నష్టం వివరాలను ఏఓ సతీశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా నాయకులు సావిత్రి, బుర్ర వెంకన్న మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావంతో వరి, మిర్చి, మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటల వారీగా నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని రైతులకు వెంటనే అందజేయాలని కోరారు. నాయకులు ఆవుల కిరణ్, రామ్మూర్తి, యాదగిరి, రాఘవులు, శంకర్, దేవ, పాషా, సమ్మన్న, ముత్తక్క, లష్కర్, రాంజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం తహసీల్‌లో వినతిపత్రం అందజేయగా, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడారు. వాంకుడోత్ సరోజిని, చింత రజిత, యాకన్న, సారంగపాణి, నాగేశ్వరరావు, నర్సింహారావు, సంగయ్య, పాపమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సుజాతనగర్: ఇటీవల తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రజాపంథా నాయకులు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.శిరీషకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రజాపంథా నాయకులు ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్ ధర్మా మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో రైతులు వరి, పత్తి, మిరప, మొక్కజొన్న, ఆకుకూరలు, కూరగాయల తోటలు నష్టపోయారని తెలిపారు. మండ్రాజుల కృష్ణయ్య, పోలెబోయన కేశవరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పాల్వంచ: తుపాన్‌తో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమ డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యాన మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లక్ష్మణ్, సోమ వినోద, మల్లయ్య పాల్గొన్నారు.

భట్టికి శుభాకాంక్షలు

కొత్తగూడెంరూరల్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అభ్యుదయ కళాసేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆనందకుమార్, అంతోటి పాల్, మంద హన్మంతు పాల్గొన్నారు.


మానవ హక్కులు గౌరవాన్ని ఇస్తాయి..



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌మక్కడ్

కొత్తగూడెంఅర్బన్: సమాజంలోని ప్రజలంతా గౌరవప్రదమైన జీవితం గడపడానికి మానవ హక్కులు సహకరిస్తాయని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం గౌతమ్‌నగర్‌లోని మహిళల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం అనే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. నిత్యం ఎక్కడో ఒకచోట మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉందని తెలిపారు. హక్కులను సాధించుకోవడానికి ఇంకా పోరాడాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వి.పురుషోత్తంరావు, పి.నిరంజన్‌రావు, కాసాని రమేశ్, మెండు రాజమల్లు, ఎండీ సాధిక్‌పాషా, యశోద, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ గిరియ్య

కొత్తగూడెంఅర్బన్: రైళ్లలో ప్రయాణించే వారు చోరీల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం రోడ్డు స్టేషన్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వి.గిరియ్య సూచించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన అవగహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికుల సామగ్రి చోరీకి గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 139కు తెలియజేయాలన్నారు. అలాగే, రాత్రివేళ ప్రయాణంలో ఆభరణాలు, ఫోన్లు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. బాణసంచా, గ్యాస్ సిలిండర్ తీసుకెళ్లడం నేరమని తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న రంగాకిరణ్, నాయకులు

చుంచుపల్లి: కొత్తగూడెం ప్రకాశం స్టేడియం ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా బీజేపీ నూతన కార్యాలయాన్ని త్వరలో అధికారికంగా ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రరావు, శ్రీనివాస్‌కుమార్, మాధవ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, నరేంద్రబాబు, రాయుడు నాగేశ్వరరావు, రాజేశ్‌నాయక్, పైడిపల్లి రవీందర్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, చింతలచెర్వు శ్రీనివాసరావు, జల్లారపు శ్రీనివాసరావు, గంధం నాగేంద్రప్రసాద్, రాపాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక శ్రీసాయిసత్య వ్రతం



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం శ్రీదత్త నగర్‌లోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా సామూహిక శ్రీసాయిసత్య వ్రతం నిర్వహించారు. పెద్దసంఖ్యలో హాజరైన మహిళలతో అర్చకుడు మాదిరాజు శ్రీరామచంద్రమూర్తి పూజలు చేయించారు. తొలుత సాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

వైరా ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో సోమవారం జూలూరుపాడు మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రోకటి సురేశ్, రామిశెట్టి రాంబాబు, సున్నా రంగారావు, మల్లెల నాగేశ్వరరావు, కంచర్ల హరీశ్, గోగుల వెంకటేశ్వర్లు, పూర్ణకంటి నాగేశ్వరరావు, అల్లాడి నరసింహారావు, బానోత్ ధర్మా, పణితి వెంకటేశ్వర్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపి ఎమ్మెల్యేను సన్మానించారు.

నేడు ఉచిత గ్రహణమొర్రి క్యాంపు

జూలూరుపాడు: కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ఉచిత గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ తెలిపారు. హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ వైద్యశాల, తెలంగాణ సమగ్ర శిక్షణ సంయుక్త ఆధ్వర్యాన శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఆరు నెలల వయస్సు నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న వారి వరకు పరీక్షలు చేస్తారని తెలిపారు.

ఏఐటీయూసీకి వందేళ్ల అనుభవం



టేకులపల్లి: మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు అనేక హక్కులు లభించేలా పోరాడిన ఏఐటీయూసీకి వందేళ్ల అనుభవం ఉందని, ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని సంఘం నాయకులు కోరారు. కొత్తగూడెంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.. గతంలో ఎన్నికైన గుర్తింపు సంఘం నాయకులు కార్మికుల సమస్యలను పక్కనపెట్టి, సంస్థ సొత్తును సర్కార్‌కు దోచిపెట్టారని ఆరోపించారు. ఈ మేరకు 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, క్రిస్టోఫర్, రాము, నితిన్, నర్సయ్య పాల్గొన్నారు.

కార్మిక వర్గ దిక్సూచి..

టేకులపల్లి: కార్మికవర్గ దిక్సూచి, వందేళ్ల చరిత్ర కలిగిన ఏఐటీయూసీని సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ కోరారు. టేకులపల్లి మండలం కేటీసీలో సోమవారం సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికుల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు. నాయకులు దాసరి రాజారాం, కొంగర వెంకటేశ్వర్లు, గుగులోతు రాంచందర్, బొల్లి కొమరయ్య షేక్ సర్వర్, వెంగళ రవి, రంజిత్, ఇబ్రహీం, నవీన్, బుర్రా శ్రీరాములు, జాన్ మహ్మద్, షేక్ వలీ, శ్రీనివాస్, సాయి, శారద పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

టేకులపల్లి: ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులు కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. టేకులపల్లి సెంటర్‌తో పాటు బొమ్మనపల్లి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, బేతంపూడి స్టేజీ, తొమ్మిదో మైలుతండా వద్ద సోమవారం ఆటపాటలతో పథకాలను వివరించారు. బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంపల్లి బాలు, నందు, మూసా, నరేంద్ర, స్నేహ, నీలా, కౌసర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో బీఆర్‌ఎస్ నాయకుల పూజలు

ఇల్లెందురూరల్: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మండలంలోని బాలాజీనగర్ ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఉపసర్పంచ్ యాకూబీ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు శస్త్రచికిత్స విజయవంతం కాగా, ఆయన త్వరగా కోలుకుని ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని కోరుకున్నట్లు తెలిపారు. శ్యామల, ఘాజీ, నిమ్మల రాములు, మహేశ్, నారపాక యాకయ్య, శంకర్, మల్లేశ్, నాగేశ్, లోక్యా, ప్రశాంత్, వాసం లక్ష్మి, పద్మ, స్వాతి, సరోజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌ను సత్కరించిన దిండిగాల



జెడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రాజేందర్

ఇల్లెందు: జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కంచర్ల చంద్రశేఖర్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ సోమవారం కొత్తగూడెంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌కు పదవి దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. రాజుగౌడ్, అనుదీప్, జయరాం, మహేందర్, మునీర్, తేజావత్ రవి, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు గోవుల పంపిణీ

పాల్వంచ: సేంద్రియ వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం రైతులకు ఉచితంగా గోవులను అందించనున్నామని పాల్వంచలోని అన్నపూర్ణ గోసంరక్షణ సమితి నిర్వాహకులు ఆంజనేయశర్మ తెలిపారు. ఈ నెల 13న 25 కోడె దూడలు, పెయ్య దూడలను ఉచితంగా ఇవ్వనున్నామని పేర్కొన్నారు. కావాల్సిన వారు 93951 48555 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హెచ్‌ఆర్‌సీఐ లక్ష్యాలు సాధిస్తాం

కొత్తగూడెంఅర్బన్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) లక్ష్యాలను సాధిస్తామని సంస్థ ఉమెన్స్ ఫోరం బాధ్యురాలు రెంటపల్లి మాధవీలత అన్నారు. కొత్తగూడెంలో సోమవారం ఆమె హెచ్‌ఆర్‌సీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహారావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుని మాట్లాడారు. కార్యక్రమంలో తిరుమల్‌రావు, శ్యాంసుందర్, రవీందర్‌రెడ్డి, రాము, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసానికి సన్నాహాలు

టేకులపల్లి: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 11 మంది కాంగ్రెస్ వారు ఉండగా, బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురే మిగిలారు. గతంలోనూ అవిశ్వాసానికి ప్రయత్నించారు. తాజాగా సోమవారం 11 మంది ఎంపీటీసీ సభ్యులు లేఖను సిద్ధం చేసుకుని ఆర్డీఓను కలిసేందుకు కొత్తగూడెం వెళ్లారు. కానీ, ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం కలవాలని నిర్ణయించుకున్నారు.

సర్వ సభ్య సమావేశం వాయిదా

టేకులపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఏర్పాటు చేశారు. మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులు, 36 మంది సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా నిర్దేశించిన సమయానికి ఎంపీపీ మినహా మిగిలిన 13 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. ముగ్గురు సర్పంచ్‌లు మాత్రమే వచ్చారు. అధికారులు కూడా అంతంత మాత్రమే వచ్చారు. 3 గంటల వరకు ఎదురుచూసి, కోరంకు సరిపడా ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీపీ భూక్య రాధ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు.

ఏటీడీఓపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఇల్లెందు: ఇల్లెందు ఏటీడీఓ విధుల్లో అలసత్వంగా ఉండటంతోనే ఆశ్రమ పాఠశాలలు, హస్టళ్లల్లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో విద్యార్థి సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. పలు సంఘాల నేతలు పృథ్వీ, సాంబ, అభిమన్యు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు విద్యా లెజెండరీ అవార్డు అందుకున్నారు. ఆదివారం విజయవాడలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు, ముఖ్య అతిథులు పురస్కారం అందించారు. వెంకటేశ్వరరావు సోమవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు.